క్లుప్తంగా

నేటి నుంచి బతుకమ్మ పూజలు



ప్రత్యేక అలంకారంలో బతుకమ్మ(ఫైల్)

పిడుగురాళ్ల రూరల్: ఒక్కేసి పువ్వేసి చంద మామా,.... ఒక జాము లాయ్ చందమామా.... ఇద్దరక్క చెల్లెండ్లు ఉయ్యాలో... ఒక్కరికిచ్చిరి ఉయ్యాలో... అంటూ నేటి నుంచి ఆడబిడ్డలో ఆడి పాడనున్నారు... ఆడపడుచులకు ఇష్టమైన బతుకమ్మ వేడుక నేడు ప్రారంభం కానుంది.. పుడమికి పూలు పందిరేసినట్లు పున్నమి వెన్నెల నేలపై వాలినట్లు.. రంగు రంగుల పూలతో రంగవల్లులు అల్లుకున్నట్లు పళ్ళెంలో, తాంబూలాల్లో, బతుకమ్మను పేర్చి.. ఆడ బిడ్డలందరూ ఒక చోట చేరి.. వీధుల్లో బతుకమ్మను ఉంచి ఆడి పాడే పండగ రానే వచ్చింది. నానే బియ్యంతో బతుకమ్మ,, అట్ల బతుకమ్మ, అడిగిన బతుకమ్మ, వేపకాయ బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ అలా ప్రతి సంవత్సరం తొమ్మిది రోజుల పండగ ఈ సంవత్సరం 11 రోజులు బతుకమ్మతో పండగ ఆడపడుచులు అందరూ ఒక చోట చేరి పాటలతో బతుకమ్మ పండుగ చేస్తారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



దాచేపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాగెండ్ల యేసయ్యని ఆదివారం ఘనంగా సన్మానించారు. నగర పంచాయతీ పరిధిలోని ఇరికెపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో యేసయ్య దంపతులను సంఘస్తులు శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించి అభినందించారు. యేసయ్య ఎంతో కష్టపడి ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి నిరుపేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాడని పాస్టర్ తగరం ప్రేమయ్య తెలిపారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించిన యేసయ్య కుమారుడు రత్న కిషోర్‌ని కూడా సంఘస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు నాగెండ్ల రత్నం, మాతంగి రాంబాబు, పత్రా రమేష్, ఆనందరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

మాచవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులందరికీ ఎరువులను అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి కె.రామమ్మ తెలిపారు. మండలంలోని శ్రీరుక్మిణిపురం రైతు సేవా కేంద్రంలో 19.8 మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్‌లో 11 మెట్రిక్ టన్నులు, మరియు పిల్లుట్ల రైతు సేవా కేంద్రంలో 10 మెట్రిక్ టన్నులు మొత్తం 40.8 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి 145 మందికి కంటి శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా పెద కాకాని శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, రోటరీ క్లబ్ అధ్యక్షులు రమేష్, సెక్రటరీ పచ్చిపులుసు పాపయ్య గుప్తా, ట్రెజరర్ ఊటుకూరి గురునాథం, అసిస్టెంట్ గవర్నర్ జె.మురళీ, అవార్డ్స్ నెట్ చైర్మన్ డాక్టర్ పి.విష్ణుబాబు, అమీర్ అలీ పాల్గొన్నారు.

నీట మునిగిన యానాది కాలనీ



నూజెండ్ల: భారీ వర్షాలుకు మండలంలోని కమ్మవారిపాలెం యానాది కాలనీ నీటిలో తేలియాడుతుంది. మూడు రోజులుగా కురుస్తున్న వానలకు సమీపంలో ఉన్న వాగు నీరు కాలనీని ముంచెత్తింది. ఇళ్ల లోకి నీరు చేరటంతో కనీసం వంట చేసుకునే పరిస్థితి కూడా లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికి పూరి గుడిసెలు కారుతున్నాయని వాపోతున్నారు. కాలనీ చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాత్రిళ్లు సమీప గ్రామంలో తలదాచుకుంటున్నామంటున్నారు. వరద నీటితో పాములు, తేళ్ళు ఇళ్ళలోకి వచ్చేస్తుండటంతో భయభయంగా గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యానాది కాలనీని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే దత్తత తీసుకున్నారు.

కుక్కలు స్వైర విహారం



మండల కేంద్రమైన రెంటచింతలలోని వివిధ కాలనీలలో కొన్ని రోజులుగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రెంటచింతలలోని ఊర్ధ్వమాత మందిరం, ఫాతిమానగర్, నాయుడుపేట ఎస్సీ కాలనీ, ఆరోగ్యపురం, రేగుల మాన్యం, పిచుకలగడ్డ తదితర కాలనీలలో సుమారు సుమారు 15 నుంచి 20 కుక్కలు వరకు సంచరిస్తున్నాయి. కుక్కల వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు వాపోయారు.

– రెంటచింతల

పొంచిఉన్న ప్రమాదం



స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. రైల్వేస్టేషన్‌కు రెంటాల గ్రామానికి వెళ్లే రహదారి ఉంది. 1939లో నిర్మించిన ఈ బ్రిడ్జి ఒక అంచున పెద్దగోయి ఏర్పడగా ఆ ప్రాంతం వారు రాళ్లు, మట్టిపోసి పూడ్చారు. బ్రిడ్జి ఒక వైపున రోజురోజుకు కుంగిపోతుండటంతో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

– రెంటచింతల

పాడి రైతులకు బోనస్



సత్తెనపల్లి: పట్టణంలోని రంగాకాలనీ సంగం డెయిరీ వెండర్ పాయింట్‌లో పశుపోషకులకు 2024–25 సంవత్సరానికి బోనస్‌ను ఆదివారం పంపిణీ చేశారు. సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి శేషగిరి కుమారి, డెయిరీ మేనేజర్ తాడి బోయిన గోపి, రూట్ సూపర్‌వైజర్ శాఖమూరి నరేష్, పాల డెయిరీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు సమక్షంలో బోనస్ మొత్తం రూ.1.47 లక్షలు పంపిణీ చేశారు. సయ్యద్ ఖాసింవలికి అత్యధికంగా రూ.12,500 అందగా సీహెచ్ నాగేశ్వరరావు, షేక్ సైదా కూడా అత్యధిక బోనస్ అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పితృకార్యాలు



అమరేశ్వర ఘాట్‌లో పితృకార్యాలు



పిండాలను కలుపుతున్న దృశ్యం

అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పెద్దఎత్తున తరలి వచ్చిన ప్రజలు పితృదేవతలకు భక్తిశ్రద్ధలతో పితృకార్యాలు నిర్వహించారు. దీంతో అమరేశ్వర ఘాట్ కిక్కిరిసిపోయింది. భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమావాస్య వరకు మహాలయ పక్షాల్లో చివరి రోజైన మహాలయ అమావాస్య నాడు వేలాది మంది భక్తులు తొలుత పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి పితృదేవతలకు పిండ ప్రదానం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిండాలను కృష్ణానదిలో నిమజ్జనం చేసశారు. అమరేశ్వరాలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మహాలయ అమావాస్యను వివరిస్తూ మహాలయ పక్షాల్లో పితృతర్పణాలు, శ్రాద్ధవిధులు నిర్వర్తిస్తే పితృదేవతలంతా సంవత్సరమంతా తృప్తి చెందు తారని పురాణాలు చెబుతున్నాయన్నారు.

యోగాసనం చాంప్‌లో సత్తెనపల్లివాసుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న యోగా పోటీల్లో విజేతలు

సత్తెనపల్లి: యోగాసనం చాంప్ 2025–26లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి వాసులు ఆరుగురు ప్రతిభ చాటారు. గుంటూరు జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఎన్జీవో కాలనీలో మున్నంగి హైస్కూల్లో ఆదివారం యోగాసన చాంపియన్‌షిప్ నిర్వహించారు. సత్తెనపల్లి యోగా గురువు రమేష్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి వాసులు పోటీ పడారు. 60 ఏళ్లు పైబడిన విభాగంలో ప్రథమస్థానం సత్తెనపల్లికి చెందిన పులికొండ శ్రీనివాసరావు, తృతీయస్థానం మాదంశెట్టి వేదాద్రి, 50–60 సంవత్సరాల విభాగంలో ప్రథమ స్థానం ధనేకుల సాంబశివరావు, ద్వితీయస్థానం పులహరి భానోజీ, 40 నుంచి 50 సంవత్సరాల విభాగంలో ప్రథమ స్థానం ఎం.సునీల్‌కుమార్, తృతీయస్థానాన్ని తల్లం ఆంజనేయులు కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి అక్టోబర్ 25, 26 తేదీల్లో వైజాగ్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. విజేతలను యోగా సాధకులు అభినందించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం



డిజిటల్ లావాదేవీలపై జరిగిన అవగాహన ర్యాలీలో డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్ కోటిరత్నం తదితరులు

నకరికల్లు: మహిళలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం సూచించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యాన మండలంలోని చాగల్లు ఎస్సీ కాలనీలో డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యతపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో డిజిటల్ చైతన్యం పెంపొందించి ఆర్థిక స్వావలంబనకు ముందడుగు వేయాలని డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ బ్యాంకు సిబ్బంది శైలజ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల ప్రాముఖ్యం, యూపీఐ, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సదుపాయాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల వినియోగం, ఆర్థిక పొదుపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌ఆన్ మోసాలను గుర్తించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో మహిళాసంఘాల సభ్యులు, యువత పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించడానికి కరాటే పోటీలు



సత్తెనపల్లి: ఒత్తిడిని జయించేందుకు కరాటే పోటీలు దోహదపడతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆర్చి డ్రాగన్ షూటో కాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. సుమారు 200 మంది బాలబాలికలు హాజరయ్యారు. శోభారాణి మాట్లాడుతూ కరాటే పోటీలతో విద్యార్థులు మానసికంగా, ఆరోగ్యంగా ఎలాంటి ఒత్తిడినైనా జయిస్తారన్నారు. ఇలాంటి పోటీలను సత్తెనపల్లిలో నిర్వహించడం, తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం బెల్ట్‌టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్చి డ్రాగన్ కరాటే ఫౌండర్ పి.రాంబాబు, జూడో సీనియర్ కోచ్ జి.సాయిరాం, ఆర్చి డ్రాగన్ కరాటే గుంటూరు ప్రెసిడెంట్ జి రవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఐదుగురు ఎంపిక



నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మల్లికార్జున ఆదివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన అచ్చంపేటలో అండర్–14, 17, బాలబాలికల జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అండర్–14 బాలికల ఫ్రీస్టైల్ విభాగంలో ఎం.శ్రీవిద్య, వై.తేజస్విని, జి.గాయత్రిలు, అండర్–17 విభాగంలో ఎం.కావ్య, జి.భూలక్ష్మిలు ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. ఐదుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

చింతపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కారెంపూడి: మండలంలోని చింతపల్లి ఎంపీయూపీ స్కూల్లో 2006–07లో ఆరో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించి ఆనాటి జ్ఞాపకాలను స్మరించుకుని సంతోషంగా గడిపారు. అప్పట్లో హెచ్‌ఎంగా పని చేసిన యాకసిరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చిట్టిబాబు, బి.శ్రీనివాసరావు, కృష్ణప్రియ, సునాఫ్, పి.కోటేశ్వరావులను పూర్వ విద్యార్థులు సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. తమ శిష్యులు వివిధ హోదాలలో ఉన్నత స్థాయిలో ఉండి ప్రయోజకులైనందుకు ఉపాధ్యాయులు అభినందించారు. పూర్వ విద్యార్థి రఫీ కార్యక్రమం నిర్వహించగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. విదేశాలలో ఉండి సమావేశానికి హాజరు కాలేని వారితో వీడియో కాల్స్‌తో ముచ్చటించుకున్నారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



పాలువాయి జంక్షన్‌లో కనకదుర్గమ్మ

రెంటచింతల: మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద త్రిశక్తి పీఠంగా(లక్ష్మీదేవి, దుర్గాదేవి, సరస్వతి దేవి అమ్మవార్లు) విరాజిల్లుతున్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వ తేదీ వరకు 29వ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు యేచూరి సాంబశివరావు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు శరన్నవరాత్రి కలశ ప్రారంభంతో ఈ వేడుకలు ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. కనకదుర్గమ్మ అమ్మ వారు 22న బాలత్రిపుర సుందరిదేవి, 23న పార్వతిదేవి, 24న లలితాదేవి, 25న అన్నపూర్ణదేవి, 26న ధనలక్ష్మీ దేవి, 27న సంతాన లక్ష్మీదేవి, 28న కాత్యాయనీదేవి, 29 న సరస్వతిదేవి(మూలా నక్షత్రం), 30వ తేదీన దుర్గాదేవి, అక్టోబర్ ఒకటిన మహిషాసురమర్దిని, 2న విజయదుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. శరన్నవ రాత్రుల మహోత్సవాలు సందర్భంగా ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భజనా కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గం. రథోత్సవం, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చిలకలూరిపేటటౌన్: తాజా ఆకుకూరలు, సీజనల్ పండ్లు, పోషకాహారంతో క్రమం తప్పకుండా తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ శాంతకుమారి చెప్పారు. కావూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు బాలసంజీవని కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రాజేష్, ప్రత్యూష, సొసైటీ అధ్యక్షుడు కోడె హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనత నివారణకు తాజా ఆకుకూరలు, సిరి ధాన్యాలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా అంగన్‌వాడీ సెంటర్‌లలో ఆరేళ్లలోపు చిన్నారుల ఎత్తు, బరువు చూపించి పోషకాహారం పొందాలన్నారు. ఆడబిడ్డలను చక్కగా చదివించుకోవాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలు జరుగుతుంటే సమాచారమివ్వాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి జి.మాధవిలత, సూపర్‌వైజర్ భూలక్ష్మి, ప్రసన్న, హేమకుమార్, పోలయ్య, మహేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'స్మార్ట్' గా తప్పులు



స్మార్ట్ కార్డులో ఇంటిపేరులో తప్పులు

ముప్పాళ్ళ : స్మార్ట్‌రేషన్ కార్డులు తప్పుల తడకగా మారాయి. కార్డులోని కుటుంబసభ్యులు, యజమాని పేరు నమోదులో అక్షరదోషాలతో పాటుగా ఇంటి నంబర్లూ తప్పులే నమోదయ్యాయి. ఇదిలా ఉంటే కొత్తగా పల్నాడు జిల్లా ఏర్పడి మూడేళ్లు దాటినా కార్డుల్లో గుంటూరు జిల్లాగానే నమోదైంది. తప్పులను గమనించి కార్డుదారులు ప్రశ్నించగా సంబంధిత సిబ్బంది.. తప్పులు సవరించి మళ్లీ కొత్త కార్డులు ఇస్తామని దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు.

దివ్యాంగుల సమగ్రాభివృద్ధికి కృషి

అమరావతి: దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సక్షం జాతీయ సహకార్యదర్శి సురేష్ పాటిల్ చెప్పారు. సమదృష్టి క్షమతా వికాసం అనుసంధానమండలి రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక శ్రీ సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో నిర్వహించారు. సురేష్ పాటిల్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో దివ్యాంగుల అభివృద్ధి, సాధికారతకు సక్షం ఎన్నో ఏళ్లుగా స్వచ్ఛంద సేవా కార్య క్రమాలు నిర్వహిస్తుందన్నారు. భవిష్యత్ కార్యాచరణ నిర్ణయాలను సభ్యుల ముందుంచి ఆమోదించారు. కార్యక్రమంలో దక్షిణ భారత సంఘటన కార్యదర్శి కె.కృష్ణమోహన్, అమరావతి ఖండ కార్యవాహ గాజుల నరేంద్ర, ఖండ సంపర్క ప్రముఖ్ పులిపాటి వెంకట పవన్ కుమార్, శ్రీసరస్వతి శిశు విద్యా మందిర్ ప్రధానోపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దోమల ఉత్పత్తి కేంద్రాలు

- చిట్టడవులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- దోమలు, విష పురుగులకు ఆవాసం
- జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



ఏపుగా పెరిగిన అడవి తుమ్మ చెట్లతో చిట్టడవిని తలపిస్తున్న వాసవి నగర్‌లోని ఖాళీస్థలం

చిలకలూరిపేట: ఖాళీ ప్రదేశాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. పొదలు పెరిగి వ్యథలుగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడు జంగిల్ క్లియరింగ్ నిర్వహించకపోవడమే దీనికి కారణం. ఫిర్యాదులు వచ్చినప్పుడు అప్పుడప్పుడు అక్కడక్కడా జంగిల్ క్లీనింగ్ చేయడం, ఆ తదుపరి పట్టించుకోకపోవడంతో తిరిగి యథాస్థితికి చేరుతున్నాయి. కంప తొలగింపు పనులు చేపట్టక పట్టణంలోని నివాస ప్రాంతాల మధ్య ఉన్న పలు ఖాళీ స్థలాలు దోమల పెంపక కేంద్రాలుగా మారుతున్నాయి. చిట్టడువుల్లా పెరిగిన తుమ్మ చెట్లు, వాటిలో చేరుతున్న వర్షపు, మురుగునీరు దోమలవ్యాప్తికి దోహదం చేస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ సమావేశంలోనూ కౌన్సిలర్లు ఇదే విషయాన్ని ప్రస్తావించటం సైతం గమనార్హం. నిల్వ ఉన్న నీటి కారణంగా దోమలు పెరిగి విషజ్వరాలు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పట్టణంలో 48 మురికివాడలు..

పట్టణ పరిధిలో 48 మురికివాడలు ఉన్నాయి. వీటిలో దాదాపుగా ప్రతిచోట ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు పెరిగి ఉన్నాయి. ముఖ్యంగా రజకకాలనీ, మోమిన్‌బజార్, రూత్‌డైక్‌మెన్ కాలనీ, మారుతినగర్, మద్దినగర్, ఎన్టీఆర్ కాలనీ, ఆది ఆంధ్రాకాలనీ, వైఎస్సార్ కాలనీ, వీరముష్టికాలనీ, భావనారుషినగర్ తదితర ప్రాంతాలలో ఈ పరిస్థితులు నెలకొని ఉంటాయి. కొంతమంది ఇళ్ల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన స్థలాలను ఖాళీగా వదిలి వేయటం, మరి కొంతమంది భవిష్యత్తులో స్థలాలకు మంచి ధర పలుకుతుందన్న ఉద్దేశంతో కొని ఖాళీగా వదిలివేయడంతో, ఆ స్థలాల్లో క్రమేపీ కంప పెరుగుతోంది.

అపరిశుభ్ర పరిస్థితులు..

నివాస ప్రాంతాల మధ్య ఖాళీ ప్రదేశాలలో పెరిగిన ఈ కంపచెట్ల మూలంగా కేవలం దోమలు పెరగటం, అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడటమే కాకుండా, విద్యుత్ లైన్లకు అంతరాయంగా మారుతున్నాయి. వీటిని సంబంధిత స్థల యజమానులకు తొలగించాల్సిందిగా పురపాలక సంఘం ద్వారా నోటీసులు జారీ చేసి తొలగింపజేయాల్సి ఉంటుంది. అదే ప్రభుత్వ స్థలాలు, పోరంబోకులలో పెరిగిన కంపను పురపాలక సంఘం వారే స్వయంగా తొలగించాల్సి ఉంటుంది. నిరంతరం కొనసాగాల్సిన ఈ ప్రక్రియ అప్పుడప్పుడు మాత్రమే నిర్వహిస్తుండటంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నాం..

గత రెండు రోజులుగా రెండు పొక్లెయిన్‌లు ఏర్పాటు చేసి కంప తొలగింపు పనులు నిర్వహిస్తున్నాం. ప్రైవేటు స్థల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. స్పందించని వారి స్థలాల్లో స్థలం పురపాలక సంఘానికి చెందినదిగా బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ నిర్వహిస్తాం.

– పి.శ్రీహరిబాబు, మున్సిపల్ కమిషనర్

• క్లాప్ మిత్రలకు వైద్యపరీక్షలు

వినుకొండ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏనుగుపాలెం పీహెచ్‌సీ సెంటర్‌లో క్లాప్ మిత్రలకు ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగేశ్వరరావు నాయక్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ సుందర్‌రెడ్డి, సర్పంచి మాదినేని వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
✆ 90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com